ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts
సంపుటి - 02 సంచిక -264 | పేజీలు - 8 వెల - 03/- | గురువారం08 జనవరి 2026

## గోదావరి మిగులు జలాలపై
# రాజకీయాలు తగవు

**తెలుగుజాతి ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి**
**రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడడం సరికాదు**
**దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి**
**దేవాదులకు తామెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు**
**జగన్ వల్లనే మరో ఆరేళ్లు వెనక్కి పోయిన పోలవరం**
**జగన్ అవినీతి కేసులపై విచారణకు 30 ఏళ్లు పట్టవచ్చు**
**ప్రాజెక్ట్ పనులు పరిశీలించాక...మీడియాతో చంద్రబాబు**






**ఏలూరు,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. సముద్రంలో కలిసే నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చు. నీటి విషయంలో రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నట్లు వెల్లడించారు. రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడటం సరికాదు. అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలి. తెలుగు జాతి ఒక్కటే.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. ఇద్దరి మధ్య విరోధాలు పెరిగి ఆనందించే పరిస్థితి రాకూడదన్నారు. భావోద్వేగాలతో ఆటలు ఆడటం మంచిది కాదు. ప్రజల కోసం రాజకీయాలు చేస్తే మంచిదే. ం

మిగతా 2లో...

## అమరావతికి చట్టబద్ధత
# కల్పించండి.

**అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి**

**జీ-రామ్-జీ పథకం నిధుల వాటాపై వెసులుబాటు కల్పించాలని విన్నపం**
**60:40 నిష్పత్తితో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని వివరణ**
**రాష్ట్రానికి కేంద్ర సహకారం కొనసాగించాలని కోరిన ముఖ్యమంత్రి**



న్యూఢిల్లీ: **జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించిన ఆయన, అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని ప్రధానంగా విజ్ఞప్తి చేశారు.

మిగతా 2లో...

## రేవంత్ రెడ్డి సోదరుడికి
# సిట్ నోటీసులు

**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు**
**విచారణకు రావాలంటూ కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు**
**బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్టు దర్యాప్తులో తేలిన వైనం**




తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) నోటీసులు పంపింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు. మిగతా 2లో...

# 24 గంటల్లో 28.95 లేన్-కిలోమీటర్ల రోడ్డు

**విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే..**
**ఏపీలో ఎన్‌హెచ్ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు**
**ఇది భారత్, ఏపీకి గర్వకారణమని సీఎం చంద్రబాబు వ్యాఖ్య**
**ఈ మార్గంతో సగానికి తగ్గనున్న అమరావతి-బెంగళూరు ప్రయాణ సమయం**



## భూ మాతను రక్షించుకుంటూ
# రైతుల ఆదాయం పెంచాలి

**అటవీ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

- **ఉద్యాన సాగులో వైవిధ్యం భూమికి రక్షణ కవచం లాంటిది**
- **విభిన్న రకాల పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి**
- **50 శాతం గ్రీన్ కవర్ అమలులో ఉద్యాన శాఖ పాత్ర కీలకం**

**అమరావతి జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**
భూ మాతను రక్షించుకుంటూ, రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచడంతోపాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 50 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. మిగతా 2లో...




## సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి




హైదరాబాద్,**జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**: సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.



## కుక్క ఏ మూడ్ లో ఉందో
# ఊహించలేం

**సుప్రీం ధర్మాసనం**
**కరిచినా, కరవకున్నా కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్య**
**వీధుల్లో, స్కూల్స్, విద్యా సంస్థల పరిసరాల్లో కుక్కలు ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్న**

వీధి కుక్కలు ఎప్పుడు కరుస్తాయనే విషయం ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్ ను అర్థం చేసుకోలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధుల్లో సంచరించే కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని

# హైకోర్టులో వైసీపీ పిల్

**మెడికల్ కాలేజీల పీపీపీ అంశంలో కీలక మలుపు..**
**పీపీపీ ద్వారా 17 కాలేజీలను నిర్వహించేందుకు సిద్ధమైన ప్రభుత్వం**
**ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని హైకోర్టులో వైసీపీ పిల్**

**అమరావతి జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**
ఏపీలోని 17 మెడికల్ కళాశాలలను పీపీపీ ద్వారా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీటిని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో వైసీపీ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఇవాళ న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. మిగతా 2లో...



# అభివృద్ధి కోసమే
## తక్కువ ధరలకు భూములిచ్చాం

**జగన్ ఐదేళ్ల కాలయాపనతో రాజధానికి గ్రహణం**
**విశాఖను వాణిజ్యనగరంగా అభివృద్ధి చేస్తున్నాం**
**యువతకు ఉద్యోగాల కల్పన కూడా మా లక్ష్యం**
**మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్ స్పష్టం**

విశాఖపట్నం**జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**
అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధానిని తరలించలేక పోయిందని ఏపీ ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మూడు రాజధానులంటూ ఐదేళ్ల కాలయాపన కారణంగా రాజధాని లేకుండా చేశారని అన్నారు. భూములు ఇచ్చిన రైతులను ఆగం చేశారనిమిగతా 2లో...



# గోదావరి మిగులు జలాలపై రాజకీయాలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చాం. దేవాదుల, కల్వకుర్తి నేనే ప్రారంభించా. దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి.. ఎవరు వద్దన్నారని సూచించారు. ఈ మధ్య కొందరి మాటలు చూస్తే.. రాజకీయాలు నాకే అర్థం కాలేదు. గోదావరి నదికి ఎగువన దేవాదుల ప్రాజెక్టు ఉంది. దేవాదుల నుంచి నీళ్లు వస్తే పోలవరానికి వస్తాయి. కిందకు వచ్చే నీళ్లకు మీరు అభ్యంతరం చెబితే ఏమైనా అర్థం ఉందా అని ప్రశ్నించారు. ఆరోజు మంజీరాకు నీళ్లు తీసుకెళ్లారు.. అప్పుడు స్వాగతించాం. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పూర్తి చేసుకోండి. దేవాదులకు మేం ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకు కూడా లబ్ధి కలుగుతుందని చంద్రబాబు అన్నారు.. మిగిలిన నీరు సాగర్, శ్రీశైలంలో నిల్వ చేస్తే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు పైన ప్రాజెక్టులు కడితే నష్టం. కృష్ణా డెల్టాను కాపాడి గోదావరిని అనుసంధానం చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రాయలసీమ ఎత్తిపోతలపై చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదు. అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందని భావిస్తున్నారు. సముద్రంలోకి వెళ్లే నీటిని అడ్డుకుంటే లాభాలు ఉంటాయి..నష్టాలు ఉంటాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఆరేడు ఏళ్లు ఆలస్యమైంది. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పాకే డయాఫ్రం వాల్ పాడైందని గత ప్రభుత్వంలోని వారికి తెలిసింది. భవిష్యత్తులో వచ్చే విపత్తులను దృష్టిలో ఉంచుకొని కొత్త డయాఫ్రం వాల్ కడుతున్నాం. ఫిబ్రవరి 15కల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అనుమతులు లేని ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఎన్జీటీకి రూ.100 కోట్ల జరిమానా కట్టారు. ముచ్చుమర్రి ఇప్పటికే ఉంది.. అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవచ్చు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. కేవలం దర్యాప్తుల పేరుతోనే కాలయాపన చేస్తే చాలా కాలం పడుతుంది. వైకాపా కుప్పకూల్చిన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం అని సీఎం అన్నారు. వైఎస్ జగన్ పాలనలో జరిగిన వివిధ అక్రమాలపై విచారణకు సుదీర్ఘ సమయం పడుతుంది.. దీనికి సుమారు 30 సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. జగన్ అక్రమాలు ఒకటి, రెండు కాదు.. ఆయన పాలనలో వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చేశారని వ్యాఖ్యానించారు.. అయితే, ఈ కేసులను విచారిస్తూ కాలయాపన చేయలేం అని స్పష్టం చేశారు చంద్రబాబు.. 2019లో ప్రభుత్వం మారిన నాటి నుంచి పోలవరం ప్రాజెక్టుకు అన్ని నష్టాలే జరిగాయి.. ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ కాపాడుకోవడానికి కనీస జాగ్రత్తలు తీసుకోలేకపోయారని మండిపడ్డారు సీఎం చంద్రబాబు.. ఆరు సంవత్సరాల కంటే ముందే ప్రారంభం కావాల్సిన ప్రాజెక్ట్ గత ప్రభుత్వ తప్పిదాలతో మరొక 6 ఏళ్లు ఆలస్యం అవుతుందన్న ఆయన.. బట్రెస్ డ్యామ్ పూర్తయ్యింది.. గ్యాప్ 1 జూన్ కి పూర్తి కావాలని లక్ష్యం పెట్టుకున్నాం.. గ్యాప్ 2 పనులు 2027 జూన్ నాటికి పూర్తి అవుతాయి.. 41.15 మీటర్ల వరకు ప్రాజెక్ట్ జనవరి 2027 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం అని వెల్లడించారు. మరోవైపు, ప్రాజెక్టులపై అన్యాయం జరుగుతుందని పర్యటనలు చేస్తే నన్ను గతంలో అరెస్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు చంద్రబాబు.. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నాకంటే గౌరవం పొందినవాళ్లు లేరన్నారు చంద్రబాబు.. ఇంకుడు గుంతలు తవ్విస్తే నన్ను ఎగతాళి చేశారు.. కానీ, గ్రౌండ్ వాటర్ రీచార్జ్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం.. ఇపుడు గ్రౌండ్ వాటర్ పెరగం చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు.. భూమినే జలాశయంగా చేసుకోవాలి అని సూచించారు.. రైతుల ఆత్మహత్యల మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్య చేసుకోవడం కరెక్ట్ కాదు. సమస్యలను తగిన విధంగా పరిష్కరించడం అవసరమని అన్నారు సీఎం చంద్రబాబు. సమావేశంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భూ మాతను రక్షించుకుంటూ రైతుల ఆదాయం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)ం

గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం గ్రీన్ కవర్ అంశాలపై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చర్యల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. గ్రీన్ కవర్ పెంపులో ఉద్యాన శాఖ పాత్ర, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం తదితర అంశాలపై ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధన అంశాలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం అన్ని ప్రభుత్వ రంగ శాఖలు అటవీ శాఖతో సమన్వయంతో ముందుకు వెళ్లాలి. గ్రీన్ కవర్ ఏర్పాటులో ఉద్యానవన శాఖ పాత్ర కీలకం. ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం తీసుకురావడం ద్వారా అటు రైతుకీ, ఇటు భూమికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. ఒకే పంటలో వివిధ రకాల జాతుల మొక్కలు అంతర పంటలుగా సాగు చేసే విధంగా రైతులను పోత్సహించాలి. సింథటిక్ మందుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి. తద్వారా భూమికి చేవ పెరుగుతుంది. జీవవైవిధ్యాన్ని రక్షంచుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, రైతు సాధికారిత సంస్థ ఎగ్జికూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నాచురల్ ఫార్మింగ్ సొసైటీ డైరెక్టర్ నివాసులు, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో 28.95 లేన్-కిలోమీటర్ల రోడ్డు

**విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే..**

**ఏపీలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు**

**అమరావతి జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**

బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో భాగంగా ఏపీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (చీనాూ×) రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఇది భారత్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు.

"బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ (చీఎ-544+)లో వీ/ం రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా చీనాూ× 24 గంటల్లోనే 28.95 లేన్-కిలోమీటర్ల పొడవున, 10,675 మెట్రిక్ టన్నుల తారు కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ దార్శనికత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణం, ఇంజినీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన కొనియాడారు. ఇదే కారిడార్‌లోని ఇతర ప్యాకేజీలలో 2026 జనవరి 11 నాటికి మరో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

భారత్‌మాల ఫేజ్-×× కింద చేపట్టిన ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇటీవల వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 11-12 గంటల నుంచి సుమారు 6 గంటలకు తగ్గనుంది. ఈ రహదారి ఏపీలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది.

మొత్తం 518 నుంచి 624 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని సుమారు రూ.19,200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో కోడికొండ నుంచి అద్దంకి/ముప్పవరం వరకు 342 కిలోమీటర్ల భాగం పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ కాగా, మిగిలిన భాగాన్ని బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ కనెక్టివిటీకి, సరుకు రవాణాకు కీలకం కానుంది.

# చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో

**వెనిజువెలా కొత్త అధ్యక్షురాలుకు ట్రంప్ హెచ్చరికలు**

**కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా**

వాషంగ్టన్ **జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలాపై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు



తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

# 50 కోట్ల జిఎస్టీ పన్ను ఎగవేత

# ఆరెంజ్ ట్రావెల్స్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్

## -ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎంపి చేతన్ కూడా అరెస్ట్

హైదరాబాద్,**జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):**:జీఎస్టీ పన్ను ఎగవేత కేసులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ యూనిట్ దాడులను మరింత ముమ్మరం చేసింది. డేటా అనలిటిక్స్, అంతర-ఏజెన్సీ సమన్వయంతో సేకరించిన ప్రత్యేక సమాచారంతో, భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర పన్ను మోసాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ ఇద్దరు ప్రముఖ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లను డీజీజీఐ అధికారులు అరెస్టు చేశారు. జనవరి 6న జరిగిన ఈ అరెస్టులు పన్ను మోసాల తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. మెసర్స్ ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌పై తీవ్ర



ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల నుంచి వసూలు చేసిన రూ.28.24 కోట్ల జీఎస్టీని గడువు ముగిసిన మూడు నెలలు గడిచినా ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా అక్రమంగా దాచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. అదే విధంగా, మెసర్స్ ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ ఎన్ రూ.22 కోట్ల మేర నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి సూత్రధారిగా వ్యవహరించినట్టు డీజీజీఐ గుర్తించింది. ఈ ఇద్దరిపై సీజీఎస్టీ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. సంఘటితంగా జరుగుతున్న పన్ను మోసాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డీజీజీఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, జీఎస్టీ ఎగవేతకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని డీజీజీఐ హెచ్చరించింది.

----------

# కుక్క ఏ మూడ్ లో ఉందో ఊహించలేం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం ఈ రోజు విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. వీధుల్లో తిరిగే కుక్క కరుస్తుందని భావించినపుడు స్థానికులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. అధికారులు ఆ శునకాన్ని తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి వదిలిపెడతారని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టెరిలైజ్ చేశాక మనుషులను కరవకుండా వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యాఖ్యానించింది. మనుషులను కరవడం మాత్రమే కాదు.. వీధుల్లో కుక్కలు పరిగెత్తడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది.

ప్రమాదం జరిగాక చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్త పడడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లో, స్కూళ్లు, విద్యాసంస్థల చుట్టుపక్కల కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. వీధుల్లో సంచరించే ప్రతీ కుక్క మనుషులను కరవకపోవచ్చు కానీ రోడ్లపై అవి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం మాత్రం ఉందని ధర్మాసనం పేర్కొంది.

# అమరావతికి చట్టబద్ధత కల్పించండి..

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం ప్రాజెక్టు పర్యటనను ముగించుకుని నేరుగా ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు, అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అమరావతిని ఏపీ రాజధానిగా ఖరారు చేస్తూ పార్లమెంటులో ఒక బిల్లును ప్రవేశపెట్టి చట్టబలం కల్పించాలని కోరారు. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని ఆయన వివరించారు.

అలాగే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'జీ-రామ్-జీ' పథకంలోని నిబంధనలపైనా చంద్రబాబు చర్చించారు. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడం వల్ల, ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, ఈ విషయంలో ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు.

ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అందిస్తున్న సహకారానికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలు, అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాల అమలు తీరుపై కూడా ఇరువురు నేతలు సమీక్షంచుకున్నారు.

# రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు జారీ అయ్యాయి.ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఉన్న అధికారులతో వీరిద్దరికి ఉన్న సంబంధాలపై సిట్ అధికారులు క్షణ్ణంగా ఆరా తీయనున్నట్టు తెలిసింది. అదే సమయంలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుడైన ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి నుంచి కూడా మరింత సమాచారాన్ని తీసుకునే అవకాశమున్నదని సమాచారం. కొండల్‌రెడ్డి వద్ద ఈ వ్యవహారానికి సంబంధించి పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. ఇక నవీన్‌రావు తండ్రి కొండల్‌రావు, ఎమ్మెల్యే కృష్ణారావు కుమారుడు సందీప్‌ల నుంచి కూడా జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై తమకు అవసరమైన సమాచారాన్ని తీసుకోవడానికి అధికారులు ప్రశ్నావళిని సిద్ధం చేసుకొని ఉన్నారని సమాచారం. నిజానికి వీరిద్దరు కూడా బుధవారమే విచారణకు హాజరు కావాల్సి ఉండగా, కారణాంతరాల వల్ల తాము గురువారం వస్తామని సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

# హైకోర్టులో వైసీపీ పిల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఉచితంగా, మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఈ మెడికల్ కళాశాలలను తాము ఏర్పాటు చేశామని వైసీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల జోక్యం ఉండకూడదని, అలా జరిగితే పేదలకు వైద్య విద్యా అవకాశాలు దూరమవుతాయని ఆ పార్టీ వాదిస్తోంది. అప్పటి ప్రభుత్వం ఈ కళాశాలల నిర్వహణకు బడ్జెట్ భారం లేకుండా చూసుకునేలా విధానాలు రూపొందించిందని, కొన్ని సీట్లను మాత్రమే డొనేషన్‌కు కేటాయించి ఆ ఆదాయాన్ని ఆసుపత్రుల అభివృద్ధికి వినియోగించేలా మార్గదర్శకాలు తయారు చేసిందని కోర్టుకు పిల్ లో వివరించింది.

పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఈ కళాశాలలను నడిపిస్తే వైద్య విద్య మాత్రమే కాకుండా, సామాన్యులకు వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండవని, అవి కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ తన పిల్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం చెబుతున్నట్టు ఆర్థిక భారం ఎక్కువగా ఉందన్నది వాస్తవం కాదని, ఇందుకు సంబంధించి ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి కోటి సంతకాలు సేకరించామని కూడా కోర్టుకు తెలిపింది.టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసింది. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌లను వైసీపీ చేర్చింది.

# అభివృద్ధి కోసమే తక్కువ ధరలకు భూములిచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. విశాఖపట్నంలో మీడియాతో లోకేశ్ మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకూ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడుల విషయంలో దేశంలోనే టాప్‌లో ఉన్నామని గుర్తు చేశారు. రాజధాని అమరావతికి మంచి విమానాశ్రయం కావాలి.. అందుకే భూసేకరణ చేస్తున్నాం అని అన్నారు.. ప్రాజెక్టుల పూర్తికి సమయం పడుతుంది. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఎకరం 99 పైసలకే ఇస్తున్నారంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెరగాలి.. మన యువతకు ఉద్యోగాలు రావాలంటే పెట్టుబడులను ఆకర్శించాల్సి ఉందన్నారు. అనేక కంపెనీలు పోటీపడి వచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్థిక రాజధాని విశాఖే కాబట్టి ఇక్కడ అభివృద్ధిపై ఫోకస్ పెట్టామని అన్నారు. అలాగే ఇక్కడ పెద్ద ఎత్తున ఐటి కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అందుకే ఇక్కడకి పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖకు ఐటీ, ఫార్మా, డేటా సెంటర్, స్టీల్ సిటీలు వస్తున్నాయి. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలనేదే కూటమి ప్రభుత్వ విధానం అని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టం అని లోకేశ్ స్పష్టం చేశారు. సముద్రంలో కలిసే వేల టీఎంసీలు కాపాడి రాయలసీమకు తీసుకెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టులకు మేం ఎక్కడా చిల్లు పెట్టలేదు. మిగిలిన నీళ్లను తెలంగాణ వాడుకోవచ్చు.. చెన్నైకు ఇవ్వొచ్చు. గతంలో పట్టిసీమ దండగని జగన్ అన్నారు. దాన్నే ఐదేళు వాడుకున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉందని మంత్రి లోకేశ్ అన్నారు. అందుకే పనుల్లో వేగం పెంచామని, అభివృద్ధిలో దూసుకు పోతున్నామని తెలిపారు. ఎపిని అగ్రభాగాన నిలబెట్టే క్రమంలో రాజీపడబోమని స్పష్టం చేశారు.

# అదుపులోకి వస్తున్న బ్లో ఔట్

**గ్రామాల్లో పరిస్తితి అదుపులోనే ఉంది -అంతా ఇళ్లకు చేరుకుంటున్నారు: కలెక్టర్**

కోనసీమ,జనవరి7: మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్‌జీసీ సైట్ నుంచి ఎగసిపడుతున్న మంటలు నేడు కాస్త అదుపులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. పరిసరాల్లోని నాలుగు గ్రామాల్లో పరిస్థితి అదుపులో ఉందని అన్నారు. బ్లోఅవుట్ పరిసర ప్రాంతాల్లోని వారు తిరిగి తమ ఇళ్లకు రావొచ్చని తెలిపారు. ఆ ప్రాంతాలను వీడిన వారిలో 90 శాతం మంది ఇప్పటికే తిరిగొచ్చారని చెప్పారు. మంటల కారణంగా ఇప్పటివరకూ జరిగిన నష్టం వివరాలను కూడా అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై ఓఎన్‌జీసీ డైరెక్టర్ కూడా విజయ్ సక్సేనా కూడా ఇటీవలే స్పందించారు. బ్లోఅవుట్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు. మంటలను పూర్తి స్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు వారం రోజులు పట్టొచ్చని కలెక్టర్ కూడా ఈ సందర్భంగా చెప్పారు.

## వైభవంగా ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

**--కీర్తిశేషులు మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం**





**ఎమ్మిగనూరు, జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా కీ. శే. బీవీ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో రెండవ రోజు గౌరవ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ఒంగోలు ఎద్దులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తమ జాతి ఎద్దులు ఈ బలప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కలిగించేదిగా ఉండగా, పెద్ద సంఖ్యలో రైతులు, చాలా ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నెముకలని, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని తెలిపారు. రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశు పోషకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కార్పొరేషన్ ఆదాయానికి గండి పడితే కఠిన చర్యలు తప్పవు

**మున్సిపల్ ఆదాయ వసూళ్లపై నిర్లక్ష్యం సహించను ఉ కమిషనర్ పి. విశ్వనాథ్ హెచ్చరిక**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 7)**

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి గండి పడేలా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, సంబంధితులపై కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో మున్సిపల్ దుకాణాల అద్దెలు, పన్ను వసూళ్ల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టైటిల్ ట్రాన్స్ఫర్, పన్ను విధింపు ప్రక్రియల్లో జరుగుతున్న అవకతవకలను ఉపేక్షించబోమని అన్నారు. మున్సిపల్ షాపుల గుడ్‌విల్, అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేషన్ ఆదాయం పెంపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని కమిషనర్ సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జిఅబశ్రీశ్రీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారులు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి : ఏ ఓ



**మహానంది, జనవరి7,( రిపబ్లిక్ న్యూస్)** )రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో, రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుని 11 నెంబర్లతో కూడిన విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉన్న రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా సంక్షమ పథకాలు అందుతాయని, రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారుఅబశ్రీశ్రీ. రబీలో వేసిన పంటలకు వెంటనే పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. సేంద్రియ,ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా, ఎరువులు వాడాలన్నారు. రైతులు పంటలకు అవసరమైన మేరకే యూరియా ఎరువులు వాడాలని, విచక్షణారహితంగా ఎరువులు వాడితే పంటను పురుగులు , తెగుళు అధిక స్థాయిలో ఆశించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, రైతులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలోని రోడ్లకు ఇరువైపులా శుభ్రం చేయించిన గ్రామ సర్పంచ్ మేకల భాగ్యమ్మ.



**పాములపాడు జనవరి 7 రిపబ్లిక్ న్యూస్:-** మండల కేంద్రమైన పాములపాడులో గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ తరపున ఆమె కుమారుడు మేకల.రాజశేఖర్ రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపోదలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ, ఆమె కుమారుడు మేకల.రాజశేఖర్ లు మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కే.జీ. రోడ్డుకు ఇరువైపులా, మరియు గ్రామంలోని ఇతర రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపోదలను, చెత్తాచెదారాన్ని జెసిబి సహాయంతో తొలగించి, ట్రాక్టర్ల ద్వారా ఈ వేస్ట్ మెటీరియల్ ను డంపింగ్ యార్డ్ కు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ దగ్గర నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు, మరియు గ్రామంలో శుభ్రం చేయించిన గ్రామ సర్పంచ్ మేకల భాగ్యమ్మకు, ఆమె కుమారుడు మేకల.రాజశేఖర్ కు, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ కు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్-ఎం.మహమ్మద్ బేగ్, ఫార్మసిస్టు- మూసా సలాం, హెల్త్ ఎడ్యుకేటర్- జి.మల్లికార్జున, యుడిసి- నారాయణదాసు, ఎంఎన్ఓ లు సి.హరికృష్ణ, యన్.పుల్లయ్య, తదితర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## భవన నిర్మాణాల వ్యర్థాల నిర్వహణ మరింత పటిష్టం

**సి - డి వ్యర్థాల అక్రమ తరలింపుపై కఠిన చర్యలు: నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 7)**

కర్నూలు నగరంలో కన్స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ (సి �aడ డి) వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సి �aడ డి వ్యర్థాల నిర్వహణ విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు సి ఆడ డి వ్యర్థాల సరైన నిర్వహణ అత్యంత కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. నిర్మాణాలు, కూల్చివేత పనుల ద్వారా ఉత్పన్నమయ్యే వ్యర్థాలను ప్రజలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. సి ఆడ డి వ్యర్థాల సేకరణ, తరలింపునకు ట్రాక్టర్‌కు రూ.500 చొప్పున నామమాత్రపు రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారికంగా నియమితమైన వ్యవస్థ ద్వారానే వ్యర్థాల తరలింపు జరగాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు సి ఆడ డి వ్యర్థాలను తరలించడం అనుమతించబోమని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ పరమేష్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి తర్వాత నగరపాలక కార్యాలయం తరలింపు

**ఎన్ఆర్ పేట నుంచి వెంకటరమణ కాలనీలోని ప్రైడ్ ప్లాజాకు మారనున్న మున్సిపల్ ఆఫీస్**









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 7)**

కర్నూలు ఎన్ఆర్ పేటలో ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంక్రాంతి పండుగ అనంతరం కర్నూలు వెంకటరమణ కాలనీలోని ప్రైడ్ ప్లాజా భవనానికి తరలించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఆయన ప్రైడ్ ప్లాజాలో కొనసాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం వద్ద నూతన భవన నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో, తాత్కాలికంగా కార్యాలయాన్ని ప్రైడ్ ప్లాజాకు తరలిస్తున్నామని కమిషనర్ వివరించారు. ఇందుకు సంబంధించిన పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇప్పటికే రూ.85 లక్షల వ్యయంతో ప్లంబింగ్, నెట్‌వర్క్, బోర్లు, బాత్రూంలు తదితర సౌకర్యాల ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

అనంతరం గడియారం ఆసుపత్రిలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జి.వి. కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి నాగరాజు, మున్సిపల్ ఇంజనీర్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా ప్రకటించేంతవరకు మా ఉద్యమం ఆగదు

**-ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తాం**




**ఎమ్మిగనూరు, జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** ఆదోని జిల్లా సాధనకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 31 రోజున సంఘీభావంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాజు, సత్తన్న, బాలరాజు, ఎల్లప్ప, యోసోపు మద్దతు తెలియజేశారు, ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కమల గణేష్ శేఖర్ నాయుడు కాజా ,ఆఫ్రిది, కృష్ణ, అమరేష్, మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతమైన ఆదోని జిల్లాగా ప్రకటించడంలో కూటమి ప్రభుత్వం వ్యతిరేక ధోరణి అవలంబిస్తుందని ఆదోని జిల్లాకే ఐదు నియోజకవర్గాలో ప్రజలు దాదాపుగా 40 రోజులు పైగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నప్పటికీ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఎందుకు కనిపించడం లేదు కనీసం రిలే నిరాహార దీక్షలు చేపట్టిన శిబిరం దగ్గరకు వచ్చిన పాపాన లేదు, ఈ యొక్క పశ్చిమ ప్రాంతం ఎన్నో సంవత్సరాలుగా విద్య వైద్యం సరైన ఉపాధి లేక వెనకబడిపోతుందని, ఆదోని జిల్లా కోసం చేపట్టిన దీక్షలకు మద్దతుగా పాలకులు మద్దతు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ యొక్క పశ్చిమ ప్రాంతమైన ఆదోని ని జిల్లా కేంద్రంగా ప్రకటించి అభివృద్ధికి నోచుకోవాలని లేకపోతే త్వరలో ఐదు నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అజిత్, రాముడు, వినోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి1న బడ్జెట్‌పై సందిగ్ధం

**ఆదివారం కావడంతో కొంత చర్చ**

**త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం**

**న్యూఢిల్లీ,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్)::** పార్లమెంట్ బడ్జె సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే బడ్జెట్ ప్రతిపాదనలను ఫిబ్రవరి1న ప్రవేశ పెడతారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో అదే రోజు ప్రవేశపెడతారా? అనే చర్చ జరుగుతోంది. అలా కానట్లయితే 2న ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. తొలిసారిగా 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లోనూబడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. 2020లో కరోనా సమయంలోనూ, అంతకు ముందు 2012 మే 13న ఆదివారం పార్లమెంట్ సమావేశం జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరిరోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదిం చాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తరువాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించే వారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండ టంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. ఈక ÷-రమంలో ఈ యేడాది కూడా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అభ్యంతరం ఉండకపోవచ్చు.

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు కీలక పాత్ర

**కర్నూలులో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయం పునఃస్థాపనకు కమిటీ తీర్మానం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 7)**

తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ అంశాలపై నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యుడిగా ఎంపీ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు నుంచి అనంతపురంకు తరలించిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ కార్యాలయాన్ని తిరిగి కర్నూలులోనే ఏర్పాటు చేయాలని ఎంపీ నాగరాజు గట్టిగా డిమాండ్ చేశారు. ఎంపీ అభ్యర్థనకు స్పందించిన స్టాండింగ్ కమిటీ, కర్నూలులో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయాన్ని పునఃస్థాపించేందుకు తీర్మానం చేయడం విశేషం. అలాగే ఎఫ్‌సీఐ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ నాగరాజు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల సంక్షమం, పరిపాలనా సౌలభ్యం కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, సదర్న్ రైల్వేస్ జనరల్ మేనేజర్‌తో పాటు తమిళనాడు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఏర్పాట్లు చేపట్టాలి

## డిఆర్ఓ ఏ.మలోల ఆదేశం





**అనంతపురం కలెక్టరేట్ ,జనవరి 07,(రిపబ్లిక్ న్యూస్ ):** గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డిఆర్ఓ ఏ.మలోల ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ఆయా శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

**జాతీయ సమైక్యత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు**

ఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను బాగా నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ ఓవరాల్ ఇంచార్జిగా ఉంటారన్నారు. జనవరి 26వ తేదీన నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలన్నారు. పెరేడ్ కోసం ఎన్సిసి, ఇతర స్కౌట్ విద్యార్థుల ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓకి సూచించారు. జాతీయ సమైక్యత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓకి సూచించారు. ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేయాలని, ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు తెలియజేసేలా శకటాల ప్రదర్శన చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హాజరైన వారికి స్నాక్స్, వాటర్ అందించాలన్నారు. ప్రధాన వేదిక వద్ద స్టేజ్ డెకరేషన్, సిట్టింగ్ ఏర్పాట్ల వద్ద అవసరమైన చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రగతిపై సందేశం సిద్ధం చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రతిభ కనబరిచిన ఉద్యోగస్తులకు అందించే ప్రశంసా పత్రాల వివరాలను వెంటనే కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని కార్యక్రమాలను విజయవంతం చేయుటకు కృషి చేయాలన్నారు.

**హాజరైన ఆయా శాఖల అధికారుల వివరాలు**

ఈ సమావేశంలో ఏఎస్పి రియాజ్ భాష, ఆర్డీఓ కేశవనాయుడు, డిఈఓ ప్రసాద్ బాబు, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, జిల్లా సైనిక సంక్షమ శాఖ అధికారి తిమ్మప్ప, డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, డిఈఓ ప్రసాద్ బాబు, డిఆర్డీఏ పిడి శైలజ, ఇంచార్జి జిల్లా వ్యవసాయ అధికారి రవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, హౌసింగ్ పిడి శైలజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డీసి మల్లికార్జున, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన డిసిసి "అధ్యక్షలకు" ఘన సత్కారం

### సత్కరించిన చిత్తూరు కాంగ్రెస్ నాయకులు



**అనంతపురం సంక్షమం, జనవరి 07,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా డిసిసి అధ్యక్షుడుగా రెండవసారి ఎన్నికైన వై.మధు సూదన్ రెడ్డికి, అనంతపురం సిటీ ప్రెసిడెంట్ గా ఎన్నికైన షేక్ ఇమామ్ వలికి చిత్తూరు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం డిసిసి మధుసూదన్ రెడ్డి స్వగృహంలో వారి ఇరువురికి సత్కార కార్యక్రమం జరిగింది.

**తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాలు అందజేత**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిత్తూరు శివంశంకర్ , క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనపర్తి సోలమన్ రాజు , అనంతపురం జిల్లా ఎస్సీ సెల్ మహిళా నాయకురాలు పోలక్క, కవితమ్మ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ద్వారా అనంతపురం జిల్లా డిసిసి, సిటీ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన శుభ సందర్భంగా వారి ఇరువురికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.

**మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా చర్చ**

అనంతపురం జిల్లా, సిటీ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశీస్సులు అందజేశారు. అదేవిధంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా (క్రిస్టియన్) మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా నూతన అధ్యక్షలతో వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మనారాయణ, బషీర్, అహమ్మద్, సుధాకర్, బాబా, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి

### విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

-----------

# ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

### ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు




**హైదరాబాద్,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# బైక్‌ను వేగంగా ఢీకొన్న ఆటో

### తల్లీ కొడుకులు దుర్మరణం




**కర్నూలు,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని కౌతాళం మండలం ఎరిగేరి సమీపంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఎరిగెరి గ్రామంలో శ్రీ బంగారమ్మ అవ్వ మహోత్సవానికి వెళ్లారు తల్లీకొడుకు మహాదేవి, నాగిరెడ్డి. దేవర సందర్భంగా మొక్కులు తీర్చుకొని తిరిగి కౌతాళంకి బయలుదేరారు. అమ్మవారి దర్శనం తర్వాత ఎంతో సంతోషంగా వెళ్తున్నవాహనాన్ని ఆటో రూపంలో మృత్యువు వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న బైక్‌ని.. ఆటో ఢీ కొట్టడంతో ఎగిరి అవతల పడ్డారు. ప్రమాదంలో తల్లీ, కొడుకు తీవ్రంగా గాయపడటంతో కన్నుమూశారు. దైవ దర్శనానికి వెళ్లిన తల్లీకొడుకులు కన్నుమూయడంతో గ్రామంలో తీవ్ర విషాదంలో నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు భద్రతా చర్యలు ఎంత కఠినతరం చేస్తున్నా ప్రమాదాలను మాత్రం అరికట్టలేకపోతున్నారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా? విలువైన వస్తువులు లాకర్లలో భద్రపరుచుకోండి

### దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డిఐజి,- కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 7)** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లే జిల్లా ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఐజి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులపాటు బయటకు వెళ్లే వారు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండుగ వేళ కుటుంబ సమేతంగా చాలామంది ఊర్లకు వెళ్లడం వల్ల, ఇదే అదనుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఇంట్లో ఎవరూ లేరని తెలియకుండా ఉండేందుకు రాత్రివేళ లైట్లు వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే పండుగకు ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేయవద్దన్నారు. అపార్టుమెంట్లు, కాలనీల్లో నివసించే వారు సీసీటీవీ_మెరాలు ఏర్పాటు చేసుకుంటే భద్రత మరింత మెరుగుపడుతుందన్నారు.

**ప్రయాణాల్లో జాగ్రత్తలు**

బస్సులు తదితర ప్రజా రవాణా వ్యవస్థల్లో ప్రయాణించేటప్పుడు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారం లేదా పానీయాలను స్వీకరించవద్దని సూచించారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షత ప్రాంతాల్లో భద్రపరుచుకోవడం ఉత్తమమని తెలిపారు.

ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే చోరీలను నివారించవచ్చని, తద్వారా పండుగను ప్రశాంతంగా జరుపుకోవచ్చన్నారు. నేరాల నివారణకు, అసాంఘిక శక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందిస్తూ జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112 లేదా డయల్ 100 కు ఫోన్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

# రీసర్వే పనులు వేగవంతంగా చేపట్టాలి

### ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ





**అనంతపురం కలెక్టరేట్ ,జనవరి 07,(రిపబ్లిక్ న్యూస్ ):** రీసర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పిజిఆర్ఎస్, ఏపీ సేవా సర్వీసెస్, ఆర్ఓఆర్, నేషనల్ హైవే, వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపు, రీ సర్వే, సివిల్ సప్లయిస్, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

**రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే పూర్తి చేయాలి**

ఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రరీసర్వేకు సంబంధించి రెండవ దశలో డిఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)కి సంబంధించి 24 గ్రామాలకుగాను 6 గ్రామాల్లో డిఎల్ఆర్ పూర్తి కాగా, పెండింగ్ ఉన్న 18 గ్రామాలకు సంబంధించి ప్రతిరోజు ఒక గ్రామంలో డిఎల్ఆర్ లను రికార్డులతోపాటు జెసి లాగిన్ కి పంపించాలన్నారు. రీసర్వే మూడో దశకు సంబంధించి పిఓఎల్ఆర్ ( ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) ఫార్మేట్స్ పూర్తికాగా, విలేజ్ సర్వేయర్ లాగిన్ లో డేటా ఎంట్రీ మొదలు పెట్టాలన్నారు. రీసర్వే నాలుగో దశకు సంబంధించి గ్రౌండ్ టు థింగ్ పనులు 90 గ్రామాల్లో జరుగుతుండగా, రైతులకు సమాచారం అందజేసి నోటీసులు ఇచ్చి జాగ్రత్తగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ పైన తగిన పరిశీలన చేయాలన్నారు. మీసేవ సర్వీసులు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, తదితర రెవెన్యూ అంశాలకు సంబంధించి ప్రతిరోజు మానిటర్ చేయాలన్నారు. రెవెన్యూ క్లినిక్ లలో వచ్చిన సమస్యలను వ్యక్తిగతంగా పరిశీలన చేసి అత్యంత నాణ్యతగా పరిష్కరించేలా చూడాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఓఆర్ కేసుల పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో 1,645 ఎఫ్.పి షాప్ లు ఉండగా, ఇప్పటివరకు 1,293 షాపులలో డేటా ఎంట్రీ పూర్తి చేయడం జరిగిందని, డేటా ఎంట్రీ జరిగిన వారికి 9వ తేదీన వారి కమిషన్ పడుతుందని, మిగిలిన 352 ఎఫ్.పి షాపుల వారు బుధవారంలోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. నేషనల్ హైవే, వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపు పెండింగ్ లేకుండా వేగంగా చేపట్టాలని, ఇందులో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

**హాజరైన ఆయా శాఖల అధికారులు**

డిఆర్ఓ ఏ.మలోల, సర్వే ఏడి రూప్ల నాయక్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# గోవు ప్రసవ వేదన ఆవేదన భరితం



**అనంతపురం వైద్యం, జనవరి 07, (రిపబ్లిక్ న్యూస్):** హిందువులు అవును గోమాతగా పూజించడం ఆనవాయితీ. పురాతన కాలం నుంచి అవును ఒక దేవుడిగా భావిస్తారు. నేటి కాలంలో ఆవులను మాంసం కోసం వధించడమే కాకుండా... పోషణలో కూడా పెద్దగా పట్టించుకోలేని సందర్భాలు అనేకం. అనంతపురం నగరంలోని భవాని నగర్ లో ఒక ఆవు ప్రసాదించే సమయంలో బాధ అరణ్య రోదనగా మారింది. స్థానికులు కడుపు నుంచి దూడ సగం బయటికి సగం లోపల ఉన్నందున బాధ తట్టుకోలేక అర్ధనాదం చేసింది. స్థానికుల సమాచారం మేరకు కౌసల్య అనే వాలంటీర్ పశువుల డాక్టర్లు ప్రసన్న, రానికోటి శంకర్ అక్కడకు చేరుకొని తక్షణమే వైద్యం అందించారు. కానీ దూడ అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. గోవును మాత్రం ప్రాణాలతో రక్షించారు. ఆవు గోవు యజమాని పెద్దన్న ఆవు దగ్గరకు వచ్చి తీస్తుళ్లారు. ఆవులను యజమానులు ఇష్టారాజ్యంగా బజారులకు వదలడంతో వాటే సంరక్షణ ప్రశ్నార్థకమైంది. అంతేకాకుండా ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నాయి. కొన్ని వాహనాలు పశువులను ఢీకొట్టడం వల్ల అంగవైకల్యంతో బాధపడుతున్నాయి. వీటికి చికిత్స చేయడానికి కూడా యజమానులు ముందుకు రావుకపోవడం దురదృష్టకరం. ఇలాంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని కౌసల్య డిమాండ్ చేశారు. రహదారుల్లో ఉండే గోవులను ఇస్కాన్ గోశాలకు తరలించి సంరక్షంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఫ్రెండ్లీ పోలీసులంటే దౌర్జన్యాలను ప్రోత్సహి ంచడమేనా

**కూటమి పాలనలో కరువైన ప్రశాంతత**

**అసత్యాలతోనే కాలం గడుపుతున్న ఎమ్మెల్యే**

**మైనార్టీలకు ఏమి చేశారో చెప్పగలరా**

**నగర మేయర్ మహమ్మద్ వసీం మండిపాటు**



**అనంతపురం కార్పొరేషన్, జనవరి 07, (రిపబ్లిక్ న్యూస్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నగరంలో ప్రశాంతత కరువైందని రోజు రోజుకు కబ్జాలు,దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు.జిల్లా వైసీపీ కార్యాలయంలో బుధవారం మేయర్ మహమ్మద్ వసీం,వైసీపీ ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు,మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ ,కార్పొరేటర్లు, నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఎమ్మెల్యే దగ్గుపాటి చుట్టూ ఎలాంటి వారు ఉన్నారో ....**

ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ నగరంలో 18 నెలల కూటమి పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఎవరు తమ ఆస్తులు కబ్జా చేస్తారో, ఎవరు ఆస్తులను వారి పేరిట బదలాయించు కుంటారో అన్న భయంతో ఆర్థిక భారమైనా తమ స్థలాలకు ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్ లను ప్రజలు ఏర్పాటు చేసుకుంటున్నారు అంటే ఏ స్థాయిలో కబ్జాలు పెరిగిపోయాయో దీనికి కారణం ఎవరో, వీటి వెనుక ఎవరు ఉన్నారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలో ఎవరు బిల్డింగ్ నిర్మించాలన్నా అధికార పార్టీ ప్రజాప్రతినిది కార్యాలయంలో కలవాలని వారి అనుమతి తర్వాతనే పనులు చేపట్టాలని అధికారులే చెపుతుండటం దురదృష్టకరమన్నారు.అధికారం శాశ్వతం కాదని,అధికారులు శాశ్వతం అని గుర్తించుకోవలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి నగరంలో అభిరుద్దిని మరచి అసత్యాలతోనే కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఎక్కడికి వెళ్లినావైసీపీ నేతలపైనా, కార్పొరేటర్లు పైనా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 40 ఏళ్ల రాజకీయ జీవితంలో కబ్జాలు,దౌర్జన్యాలు,ఫ్యాక్షన్, రౌడీయిజం ప్రోత్సహించలేదన్నారు.నేడు ఎమ్మెల్యే దగ్గుపాటి చుట్టూ ఎలాంటి వారు ఉన్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు.అదే విధంగా ఎమ్మెల్యే స్థాయిలో ఉండి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తుండటం కూడా సమంజసం కాదని గుర్తించు కోవలన్నారు. మీ బెదిరింపులకు ఎవరూ బయపడరని, గతంలో ఇలాంటి బెదిరింపులు చేసిన వారు ప్రజా జీవితంలో ఏమైయారో గుర్తించుకోవాలని ఆయన సూచించారు.

**సీఐ అక్రమ కేసులు కట్టారు**

ఒకవైపు ఫ్రెండ్లీ పోలీస్ అని ఉన్నతాధికారులు చెపుతున్నారని అందుకు భిన్నంగా నగరంలో పోలీసు యంత్రాంగం మాత్రం అధికార పార్టీ చెప్పిందే వేదంగా పాటిస్తున్నారని ఆయన విమర్శించారు. నగరంలోని గుల్జార్ పేట లో మురుగు కాలవ నిర్మాణము పనులు చేస్తూ అడ్డం ఉందనే ఉద్దేశంతో టీడీపీ జెండా కట్టను నేతలు, అధికారులు కాంట్రాక్టర్ సమక్షంలో తొలగించి తిరిగి అదే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని పనులు చేశారు. అక్కడ ఉన్నారన్న నెపంతో స్థానిక కార్పొరేటర్ కుమారుడిపై అక్రమ కేసు నమోదు చేశారని ఇదేమని ప్రశ్నించేందుకు వెళ్లిన తనతోపాటు మా పార్టీ నేతలపై సీఐ దురుసుగా వ్యవహరించి తిరిగి తమపైనే అక్రమంగా కేసు పెట్టారని విమర్శించారు.అయితే టీడీపీ నేతలు ఎన్ని దౌర్జన్యాలు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, ఫ్రెండ్లీ పోలీస్ అంటే దౌర్జన్యాలు,కబ్జాలను ప్రోత్సహించడమేనా అధికార పార్టీకి మాత్రమే ఫ్రెండ్లీ పోలిసింగా అని ఆయన ప్రశ్నించారు.నగరంలో తమ పాలకవర్గం ఆమోదించిన పనులకు,నగర పాలక సంస్థ నిధులతో చేపడుతున్న అభిరుద్ధి పనులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమిపూజ చేస్తూ తన ఫోటోలు వేసుకుంటూ మరోవైపు వైసీపీ హయాంలో ఏమి జరగలేదని చెపుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు.ఎవరి హయాంలో అభిరుద్ధి జరిగిందో నగర ప్రజలు అందరికీ తెలుసునని ఎమ్మెల్యే చెప్పే మభ్యపెట్టే మాటలు ప్రజలు నమ్మరని ఆయన తెలిపారు.

**డంప్ యార్డ్ ఎందుకు ఆలస్యం అవుతుందో**

గత సంవత్సరం అక్టోబర్ 2 గాంధీ జయంతి లోపు డంప్ యార్డ్ బయో మైనింగ్ పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారని జనవరిలో సంక్రాంతి వస్తున్నా ఇంకా ఎందుకు పూర్తి కాలేదో,ఇదే సంస్థ ఇతర ప్రాంతాల్లో వేగవంతంగా పనులు చేస్తున్నా ఇక్కడ ఎందుకు ఆలస్యం అవుతుందో త్వరలోనే ఆధారాలతో సహా బయట పెడతామని ఆయన స్పష్టం చేశారు.నగరంలో బళ్లారి బైపాస్ నుండి పంగల్ రోడ్ వరకు నిర్మించిన రోడ్ కొందరికి అనుకూలంగా వంకర టింకరగా నిర్మించారని ఎమ్మెల్యే అసత్యపు ఆరోపణలు పదేపదే చేస్తున్నారని అధికారం ఉంది కదా అక్కడ నిజంగా వంకర టింకరలు ఉండి ఉంటే సరి చేస్తే ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు.అదే విదంగా టీడీపీ 18 నెలల కాలంలోముస్లింలకు చేసింది ఏమి లేదని,స్మశానవాటికలో కాంపౌండ్ వాల్ కూడా మున్సిపల్ నిధులతో నిర్మించామన్నారు.

**ఇప్పటికైనా అసత్యాలు మానుకో**

రెండు రోజుల క్రితం ముగ్గురికి కండువాలు కప్పి 5 వేల మంది తమ పార్టీలో చేరారని, ముస్లింలకు ఎంతో చేశామని పవిత్రమైన టోపి పెట్టుకుని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అపద్దాలుచెప్పడం సిగ్గుచేటన్నారు.ఇప్పటికైనా అసత్యాలు మానుకుని నగర అభిరుద్ధి పై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ కూటమి పాలనలో దళితులకు రక్షణ కరువైందని దళిత హోంమంత్రి ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని విమర్శించారు.నగరంలో 18 నెలల కాలంలో చేసింది ఏమిటో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెప్పాలని,సీఎం తో నిధులు తెచ్చి ఒక్క రోడ్అయినా ,ఒక డ్రైనేజీ అయినా చేపట్టారా అని ప్రశ్నించారు .వైసీపీ హయాంలో జరిగిన అభిరుద్ధి పై నాడు నేడు పనులు అంటూ మున్సిపల్ కార్యాలయంలో ఎక్జిబిషన్ పెట్టామని,నేడు శిలాఫలకాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

**మా అభిరుద్దే మమ్మల్ని రానున్న ఎన్నికల్లో గెలిపిస్తుంది**

మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వై ఎస్ జగన్మోహన్ రెడ్డి చెల్లిందని,నేడు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. వైసీపీ హయాంలో అనంత వెంకటరామిరెడ్డి సారథ్యంలో నగరంలో అభిరుద్ధికి ఎంత ఖర్చు చేశామో నివేదికలు చూడండని ఎమ్మెల్యే దగ్గుపాటి కి సూచించారు.నగరంలో ఇప్పుడు జరుగుతున్న అభిరుద్ధి అంతా మాపాలక వర్గం పాలనకే చెల్లుతుందని మా అభిరుద్దే మమ్మల్నిరానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్,శ్రీనివాసులు,రహంతుల్లా, కమల్ భూషణ్,కో అప్షన్ సభ్యులు శంషుద్దీన్ ,నాయకులు దాదు,రామచంద్ర,దాదా ఖలందర్, రియాజ్ , మాబ్బాషా , ముక్తియర్ ,కాకర్ల శీనా తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో పోలీసులకు స్మార్ట్ పోలీసింగ్

**కొత్త క్రిమినల్ చట్టాలపై రెండు రోజుల శిక్షణ తరగతుల నిర్వహణ**





**నంద్యాల క్రైం, జనవరి 7, (రిపబ్లిక్ న్యూస్):** ఏఎస్పీ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో బుధవారం డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ మురళీధర్ రెడ్డి, టెక్నికల్ టీమ్ సహకారంతో స్మార్ట్ పోలిసింగ్, కొత్త క్రిమినల్ చట్టాలలో భాగంగా ఉన్న అన్ని ఆన్‌లైన్ అప్లికేషన్లపై రెండురోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డీజీ/ఐజి కాన్ఫరెన్స్ డాష్‌బోర్డ్, ఈ-సాక్ష్యం, ఈ-సమ్మన్స్, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్, సిస్టమ్స్, మెడికల్ లీగల్ ఎవిడెన్స్ ప్రిజర్వేషన్, మంత్లీ రిపోర్ట్స్, నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్, సుదర్శన్, గాండీవ తదితర కీలక ఆన్‌లైన్ వ్యవస్థలపై సవివరంగా అవగాహన కల్పించబడింది. ఈ శిక్షణకు నంద్యాల జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుండి దాదాపు 62 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వారికి ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి నేరాల నియంత్రణ, దర్యాప్తు ప్రక్రియలను మరింత మెరుగుపరచుకోవడంపై ప్రాయోగిక శిక్షణ అందజేయబడింది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బంది డిజిటల్ వ్యవస్థల వినియోగంలో నైపుణ్యం పెంపొందించుకోవడంతో పాటు, కొత్త క్రిమినల్ చట్టాల అమలులో మరింత సమర్థత సాధించగలుగుతారని అధికారులు తెలిపారు.

## కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలతో..

# రైతుల కళ్ళలో ఆనందం

**జగన్ ఫోటోల పిచ్చితో రాష్ట్రం సర్వనాశనం**

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజం**

**పట్టాదారు పాస్‌పుస్తకాలు రైతుల ఇళ్లకే పంపిణీ**




**నంద్యాల బ్యూరో, జనవరి 7,(రిపబ్లిక్ న్యూస్):**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షమ పథకాలన్నింటికి ప్రజల మద్దతు వెల్లు వెత్తుతోందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షళన బాట పట్టించి, రాజముద్రతో రైతులకు వారి పేర్లతో కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాల తో రైతుల్లో ఆనందం నెలకొని ఉందని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదిలోనే రెవెన్యూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో రీఉసర్వే పేరుతో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారని మంత్రి ధ్వజమెత్తారు.జగన్ బొమ్మల తో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి వ్యవస్థను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడమే కాకుండా, రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం కలిగించి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. రీఉసర్వే ప్రక్రియలో హద్దురాళ్ల ఏర్పాటు పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, హద్దురాళ్లపై కూడా ఫోటోలు ముద్రించి తన బొమ్మల పిచ్చిని జగన్ ప్రజల నెత్తిన రుద్ది పైశాచికత్వం తో ప్రవర్తించిన తీరు క్షమించరానిదని అన్నారు. రాష్ట్రంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, జనవరి 2 నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా పంపిణీ జరుగుతున్నదని తెలిపారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 51,017,తాను ఇన్చార్జి మంత్రిగా ఉన్న నెల్లూరు జిల్లాలో 93,986రాజముద్ర పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో 24864, నంద్యాల జిల్లాలో 21470 కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూ ఆర్ కోడ్‌తో, దేశంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సాంకేతికతతో ముద్రించడం జరిగిందన్నారు. రైతులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేస్తే ఉచితంగా సరిదిద్దుతూ కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేయడం జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకొని, భూసర్వే పూర్తైన తర్వాత పాస్‌పుస్తకాలను నేరుగా రైతుల ఇళ్లకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పంపిణీ చేస్తున్నట్టు మంత్రి ఫరూక్ తెలిపారు.

# ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**నెలవారీ ప్రణాళికతో లక్ష్య సాధనకు కృషి చేయాలి**

**పురోగతి లేని మండలాలపై ప్రత్యేక దృష్టి -జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జనవరి 7,(రిపబ్లిక్ న్యూస్):**

ఉగాది పండుగ నాటికి జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ డీఈలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా జిల్లాకు కేటాయించిన 14,868 ఇళ్ల నిర్మాణాలను నియోజకవర్గాల వారీగా స్పష్టమైన లక్ష్యాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం రూఫ్ స్థాయిలో ఉన్న 1,583 ఇళ్లు, లింటెల్ స్థాయిలో ఉన్న 2,805 ఇళ్లు, బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న 6,880 ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసేలా హౌసింగ్ ఇంజనీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పిఎం జన్మన్ పథకం కింద వివిధ దశల్లో ఉన్న 556 ఇళ్ల నిర్మాణాలు కూడా నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో నెలవారీ ప్రణాళికలు రూపొందించి, పూర్తి చేయాల్సిన ఇళ్ల వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు, డీఈలకు స్పష్టంగా అందజేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులను ప్రత్యక్షంగా కలసి, ఇళ్ల నిర్మాణాల ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పిస్తూ పనులు పూర్తి చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, గడివేముల మండలాల్లో ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తక్కువ పురోగతి సాధించిన మండలాలను ప్రత్యేకంగా తనిఖీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.కొత్తగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు హౌసింగ్ 2.0 పథకం ద్వారా పట్టణ పేదలు మరియు మధ్యతరగతి కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా, సానుకూల దృక్పథంతో పనిచేస్తూ, ముఖ్యంగా రూఫ్ స్థాయిలో నిలిచిపోయిన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులకు ఆదేశించారు.



# పవన్ కళ్యాణ్ ని విమర్శించే

# అర్హత ఆర్కే రోజా కి లేదు.

**నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు.**



**నంద్యాల బ్యూరో, జనవరి 7,(రిపబ్లిక్ న్యూస్):**ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని, జన సైనికులను మరియు వీర మహిళలను ఘాటయిన పదజాలం తో మాజీ మంత్రి రోజా విమర్శించడం తగదని నంద్యాల జన సేన నాయకుడు మారాసు గురుబాబు మండి పడ్డారు 21 కి 21 సీట్స్ తెచ్చుకొని 100% స్ట్రైకింగ్ రేట్ తో రాష్ట్రం లో తన ముద్ర తో ముందుకు వెళ్తూ దేశం లోనే మచ్చ లేని,అవినీతి లేని నాయకులు, యూత్ కు ఆదర్శ నాయకులు గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి నీకు ఉందా రోజా అంటూ ప్రశ్నించారు.? ఇలా పవన్ ని, జన సైనికులను, వీర మహిళల ను అవమాన పరిచే విధంగా ఇంకోసారి అదుపు లేకుండా నోరు పారేసుకుంటే జనసైనికులు, వీర మహిళలతో నిన్ను, నీ ఇంటిని ముట్టడించి ఆయనకు నీతో క్షమాపణ చెప్పిస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

# డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలి

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ - అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్.**

**డి.ఎస్.పి రఘు చందర్. రూరల్ ఇన్స్పెక్టర్ సుధాకర్. ఎస్సైలు సుధీర్ రావు. గీత. కృష్ణ పాల్గొన్నారు**









**రాయికల్ పట్టణం జనవరి 07( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని డ్రగ్స్. మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా నిర్మూలించి భావితరాలకు ఆరోగ్యకరమైన సురక్షతమైన భవిష్యత్తును అందించాలని లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ తెలిపారు. బుధవారం రోజున ట్రైకల్ మండల కేంద్రంలో గల ఆర్ఆర్ గార్డెన్స్ లో జిల్లా పోలీస్ శాఖ మరియు రాయికల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థిలకను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. డ్రగ్స్ మాదకద్రవ్యాలకు బానిసలు అవడం వల్ల యువత భవిష్యత్తు పూర్తిగా నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యలపై దృష్టి సారించి మంచి చదువుతోపాటు క్రీడలు సృజనాత్మక కార్యక్రమాలు పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శరీరక మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నం కావడం నేరాలకు పాల్పడే పరిస్థితిలు ఏర్పడతాయని తెలిపారు. డ్రగ్స్ సరఫరా. వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాబోయే రోజుల్లో మాదకద్రవ్యాల నిర్మూలనలో కీలక పాత్ర పోషించేది నేటితరం విద్యార్థులేనని పేర్కొన్నారు. విద్యార్థుల దృష్టి పూర్తిగా తమ విద్యా రియర్ పై ఉండాలని నిషేధిత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకూడదని సూచించారు. అధిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు మత్తు పదార్థాలను ఆశ్రయించకుండా సానుకూల మార్గాలను ఎంచుకోవాలని తెలిపారు. స్నేహితుల ఒత్తిడితో చెడు మార్గాల వైపు అడుగులు వెయ్యరాదని హెచ్చరించారు. మాధక ద్రవ్యాల భారిన పడుతున్న యువతను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని. అందులో భాగంగా విద్యాసంస్థలు గ్రామ అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం యువత విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్లుగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను స్నేహితులు బంధువులకు తెలియజేసి డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. డ్రగ్స్ లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులే సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మేము డ్రగ్స్ తీసుకోము మా బంధుమిత్రులు స్నేహితులు చుట్టుపక్కల వారు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూసుకునే బాధ్యత మాదే. డ్రగ్సు వల్ల కలిగే అనర్థాల గురించి వారికి అవగాహన కల్పిస్తాము అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి శ్రీ శేషాద్రి రెడ్డి ఐపీఎస్. డీఎస్పీ రఘు చందర్. రూరల్ ఇన్స్పెక్టర్ సుధాకర్. ఎస్సైలు సుధీర్ రావు. గీత. కృష్ణ. ఎంఈఓ. ఎమ్మార్వో. జేఏసీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వాసరి రవి. ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్. కోశాధికారి మచ్చ శేఖర్. ఉపాధ్యాయులు. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని సమీక్ష

**వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ - అదనపు కలెక్టర్ రాజా గౌడ్**






**రాయికల్ పట్టణం జనవరి07( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా ఓటర్ లిస్టు మరియు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై జిల్లా కలెక్టర్లు అడిషనల్ కలెక్టర్లు (లోకల్ బాడీస్). ఆర్డీవోలు మరియు మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ లో నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని . జగిత్యాల కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్. జిల్లా స్థానిక సంస్థల అదన కలెక్టర్ బి రాజ గౌడ్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపాలిటీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ లకు రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధిత పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు వారీగా మరియు పోలింగ్ స్టేషన్ వారిగా ఎన్నికల ఓటర్ జాబితాల తయారీపై సూచనలు అందించారు. ఖచ్చితమైన ఓటర్ జాబితాల తయారీ ఎంతో ముఖ్యమని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. నిర్దేశించి మార్గదర్శకాలు మరియు కాల పట్టికలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల కొత్త ఓటర్లు చేర్పుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డూప్లికేట్ మరియు అనర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు పై చర్చించి తగిన సూచనలు అందించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల యంత్రాంగం మరియు మున్సిపల్ అధికారుల మధ్య సమన్వాయాన్ని సమీక్షంచారు పోలింగ్ స్టేషనులకు సంబంధించి తాజా హౌటల్ డేటాను వినియోగించాలని సూచించారు. అవసరమైన చోట్ల పోలింగ్ స్టేషనులను పునర్వ్యవస్థీకరణ చేయాలని తెలిపారు. ఓటర్ జాబితాల తయారీ సమయంలో ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని వివరించారు. ఓటర్ల లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని చట్టబద్ధ పారములు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా మరియు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ విధానాలపై చర్చించారు. ఓటర్ జాబితాల తయారీలో ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. స్వేచ్ఛాయుత మరియు న్యాయమైన ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని కమిషన్ పునరుద్ఘాటించింది. అన్ని ముందస్తు చర్యలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. 12-01-2026 సమయానుసారం సవరించబడిన తెలంగాణ పురపాలక చట్టం 2019లోని సెక్షన్ 195 -ఎ జగిత్యాల జిల్లా మొత్తం ప్రకారం వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితాల ప్రచురణ. 13-01-2026 పోలింగ్ కేంద్రాల జాబితా యొక్క ముసాయిదా ప్రచారణ మరియు దానిని టీ పోలోలో అప్లోడ్ చేయడం.16-01-2026 కలెక్టరేట్ల కార్యాలయాలు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలు ఆర్డిఓ కార్యాలయాలు మరియు తాసిల్దార్ కార్యాలయాలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా మరియు పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటో ఓటర్ల జాబితాల ప్రచురణ అని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ. జిల్లాలో ఐదు మున్సిపాలిటీలో 229 అభ్యంతరాలు రాగ సంబంధిత అధికారులు వాటికి బదులు తెలపాలని అన్నారు. వచ్చిన ప్రతి అభ్యంతరానికి క్షత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అలాగే నామినేషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పోలింగ్ సిబ్బంది మరియు ఆర్వోల నియామకం శిక్షణ అందించడం డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు కౌంటింగ్ కేంద్రాలు గుర్తింపు పోలింగ్ స్టేషన్లో వద్ద మౌలిక వసతులు భద్రత ఏర్పాట్లు ఎన్నికల కోడ్ అమలు ఓటర్ల అవగాహన కల్పించే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. జిల్లా నోడల్ అధికారులు మరియు ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన విధులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సో జగిత్యాల. కోరుట్ల. మెట్పల్లి. ఆర్డీవోలు మధుసూదన్. దివాకర్ రెడ్డి. శ్రీనివాస్ జెడ్పీ. సీఈవో గౌతమ్ రెడ్డి. జడ్పీ డిప్యూటీ సీఈవో పి. నరేష్ డిపిఓ మదన్ మోహన్. జిల్లా నోడల్ అధికారులు జగిత్యాల. కోరుట్ల. మెట్పల్లి. ధర్మపురి. రాయికల్ మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో హరిత మేడం లాయర్ కుమారుడు పుట్టినరోజు



**కుప్పం రిపబ్లిక్ న్యూస్ జనవరి 7**

అందరికీ నమస్కారములు కుప్పం నియోజకవర్గ ఉన్నటువంటి లాయర్ హరిత మేడం గారి కుమారుడు పుట్టినరోజు జరపడం జరిగినది ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరిపించుకోవాలని ఆ పిల్లవానికి ఆరోగ్యం ఆ దేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కుప్పంలో ఉన్న అభిమానులు పాల్గొనడం జరిగినది పుట్టినరోజు సందర్భంగా అనాధ ఆశ్రమంలో అనాధలకు భోజనం వసతి పండ్లు ఫలహారాలు అందిస్తూ పుట్టినరోజు జరిపించడం చాలా ఆనందంగా ఉందంటూ హరిత మేడం తెలియజేశారు చాలా గొప్ప విషయం ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరిపించుకోవాలని కోరుకుంటున్న అభిమానులు






# రేగుంట గ్రామాన్ని సందర్శించిన ఏడి అమరేందర్




**మల్లాపూర్ జనవరి 7 (రిపబ్లిక్ న్యూస్)**

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని లోవొల్టేజ్ సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికగా లోవొల్టేజ్ సమస్య తీర్చడానికి ఈ రోజు రేగుంట గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకొని ఆధనంగా విధ్యుత్ లైన్ల ఏర్పాటు కొరకు అనుకూలంగా ఉన్న స్థలాలను పరిశీలించిన ఏడీ అమరేందర్, ఏఈ సంతోష్ , సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, లైన్మెన్ లక్ష్మణ్, ఏఈవో వంశీ, జూనియర్ లైన్మెన్ భైర రాకేష్, నాయకులు నల్ల రాజేశం, శిశుపాల్ రెడ్డి, సురుకంటి తిరుపతి రెడ్డి, మిట్టపల్లి రాజేశం. తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్లో జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ పసతులు ఉచితం !!

**-రాయికల్ పాత్రికేయులతో కరపత్రం విడుదల**

**-జిల్లా స్కిల్ కమిటీ సభ్యుడు నాగిరెడ్డి తిరుపతి**



**రాయికల్ పట్టణం జనవరి 07( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణము లో ప్రతిమ ఫౌండేషన్ టాటా స్కై జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువత కోసం అందిస్తున్న ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించిన కరపత్రాన్ని జేఏసీ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా స్టీల్ కమిటీ సభ్యులు నాగిరెడ్డి రఘుపతి మాట్లాడుతూ బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎసి సోలార్ టెక్నీషియన్ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ వంటి కోర్సులతోపాటు మహిళలకు ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షనా టైలరింగ్ హోమ్ ఎయిడ్ హెల్త్ కూర్సుల్లో ఉచిత వసతి భోజన సౌకర్యంతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత పూర్తిగా సద్విని చేసుకోవాలని ఆయన కోరారు ఆసక్తి గల యువత పేరు నమోదు చేసుకోవడానికి 99 63347142 నెంబర్ ను సంప్రదించవచ్చని అని తెలిపారు ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వాసరి రవి ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్ ఉపాధ్యక్షులు చింతకుంట సాయికుమార్ పాత్రికేయులు సింగిడి శంకర్ గుర్రాల వేణు నాగమల్ల శ్రీఖర్ శ్యాంసుందర్ లింబాద్రి కిరణ్ విజయ్ జితేందర్ కృష్ణారెడ్డి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

# చేర్ల కొండాపూర్ లో ఇందిరా మహిళా శక్తి చీరలు పంచిన గ్రామ సర్పంచ్ దేవుని రవి





**రాయికల్ పట్టణం జనవరి 07( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం చేర్ల కొండాపూర్ గ్రామంలో ఇందిర మహిళా శక్తీ చీరలను అశ్విత వి ఒ మామిండ్ల భాగ్య లక్ష్మి ద్వారా ఆ గ్రామ సర్పంచ్ దేవుని రవి మహిళలకు పంపినిచేశారు ఈ సందర్భంగా సర్పంచ్ దేవుని రవిని ఉపసర్పంచ్ ఆర్మూర్ లక్ష్మీనారాయణ లను సాల్వలతో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఏనుగంటి లతా బందెల లక్ష్మి సత్కరించారు ఈ కార్యక్రమంలో ఏపీఎం నరహరి సార్ కు సిసి లావణ్య మేడం కు గ్రామ సమైక్య సభ్యులు సాలువలతో సత్కరించారు ఈ సందర్భంగా దేవుని రవి మాట్లాడుతూ చీరలు పూర్తి రాలేదని ఈ విషయమై అధికారులు ఏపీఎం నరహరి సార్ విన్నవించారు అందరికిచ్చే విధంగా చూడాలని సార్ ను కోరారు ఈ కార్యక్రమంలో వి ఒ ఏ మామిండ్ల భాగ్యలక్ష్మి గ్రామ సర్పంచ్ దేవుని రవి ఉప సర్పంచ్ ఆర్మూర్ లక్ష్మీనారాయణ ఏనుగంటి లతా బందెల లక్ష్మి లచ్చక్క మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు

# జగిత్యాల బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్

**రాయికల్ పట్టణం జనవరి 07( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల పట్టణ భారతీయ రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు గట్టు సతీష్ తన పదవికి రాజీనామా చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు తన రాజీనామా పత్రాన్ని జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కు పంపినారు ఆయన మాట్లాడుతూ నాకు అన్ని విధాల సహకారాలు అందించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాజీ ఎంపీ కవిత మేడం ఎమ్మెల్సీ ఎలగందుల రమణ పార్టీ కార్యకర్తలు నాకు అందరు సహకరించారు నా వ్యక్తిగత కారణాల వల్ల నేను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు అని తెలిపారు



తేదీ: 7.1.2026

శ్రీయుత గౌరవనీయులైన కల్వకుంట విద్యాసాగర్ రావు BRS పార్టీ అధ్యక్షులు గారికి,

విషయం: BRS పార్టీ పట్టణ అధ్యక్ష పదవి రాజీనామా గురించి.

మీకు నమస్కరించి తెలియజేయునది ఏమనగా నేను 2014 నుండి 2026 దాదాపు (దశాబ్ద) కాలం నుండి మన రాష్ట్రం BRS పార్టీ అధినేత, రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ గారి నాయకత్వములో BRS పార్టీ (TRS) కార్యకర్తగా మరియు జగిత్యాల పట్టణ పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఈరోజు నావ్యక్తిగత కారణాల వలన నేను పార్టీ అధ్యక్షుత పదవికి రాజీనామా చేస్తున్నాను.

BRS పార్టీ నన్ను కుటుంబసభ్యునిగా ఆదరించి BRS పట్టణ పార్టీ అధ్యక్షునిగా గౌరవించిన జిల్లా పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు గారికి, MLA డా.యం.సంజయ్ కుమార్ గారికి, MLC కవితక్క గారికి, MLC యల్ రమణ గారికి, జిల్లా పరిషత్ ఛైర్మన్ దావ వసంత-సురేష్ గారికి మరియు జగిత్యాల ప్రాంత వివిధ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, పార్టీ కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు...

ఇట్లు
గట్టు సతీష్
అధ్యక్షులు
పట్టణ BRS పార్టీ జగిత్యాల.
జగిత్యాల.

# నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం

## మరో నలుగురిని విచారించేందుకు అనుమతి

విజయవాడ,**జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** గత కొన్ని నెలల నుంచి సంచలనంగా మారిన విజయవాడ నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురుని విచారించిన ఎక్సైజ్ కోర్టు తాజాగా మరో నలుగురిని విచారించేందుకు అనుమతినిచ్చింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు, విజయవాడ కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ మద్యం రాకెట్‌లో ప్రధాన నిందితులకు సహకరించిన వారిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. తాజాగా నకిలీ మద్యం కేసులో బాలాజీ , తలారి రంగయ్య , సుదర్శన్ , ప్రసాద్ లను శుక్రవారం నుంచి సోమవారం వరకు కస్టడీకి ఎక్సైజ్ కోర్టు అనుమతినిచ్చింది. నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉందని భావించిన ఎక్సైజ్ కోర్టు.. పోలీసుల విజ్ఞప్తి మేరకు ఈ కస్టడీని అనుమతించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాములను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నలుగురి కస్టడీ ద్వారా నకిలీ మద్యం కేసులో మరిన్ని కీలక అధారాలు లభిస్తాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.



# మంత్రి దామోదర ఆశీస్సులు నాకే ఉంటాయి.

## -అధికారం ఉన్న లేకున్నా ప్రజల మధ్యనే ఉండేవాడు. -7వ మాజీ కౌన్సిలర్ తోట్ల మమత రామకృష్ణ.

**అందోల్ జనవరి 7 ( రిపబ్లిక్ న్యూస్**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 7వ వార్డ్ కౌన్సిలర్ బరిలో నేనుంటానని తోట్ల మమతా రామకృష్ణ అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులు నాకే ఉంటాయని, నేను చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నేను కాంగ్రెస్ నుంచి పోటీచేసి కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యాను. కానీ ఓడిన గెలిచిన ప్రజల మధ్యనే ఉన్నానని ఆయన అన్నారు. నా వార్డ్ ప్రజలకు ,అందోల్ గ్రామ ప్రజలకు గాని ఎలాంటి ఆపద వచ్చిన ముందుండి పనిచేసే నాయకత్వం చేశానని ఆయన అన్నారు.



ఇప్పుడు కూడా కులమత విభేదాలు తేడా లేకుండా కలుపుకుపోయే తత్వం నాదని ఆయన అన్నారు. ఈ మున్సిపల్ ఎలక్షన్లో ప్రజల అండలందలు నాకే ఉంటాయి తోట్ల మాజీ కౌన్సిలర్ మమత రామకృష్ణ అన్నారు.

మంత్రి ఆశీస్సులు కూడా నాకే ఉంటాయి అని ఆయన హితువు పలికారు. 7వ వార్డ్ ప్రజలకు రాత్రి పగలు తేడా లేకుండా అందుబాటులో ఉండి ప్రతి సమస్య పైన కొట్లాడే తత్వం నాదని ఆయన అన్నారు. ఈసారి మంత్రి ఆశీస్సులు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాలన్నీ ప్రజలకు అందే విధంగా చూస్తానని మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్ తోట్ల మమత రామకృష్ణ ఆయన అన్నారు.

# జోగిపేటలో 14వ వార్డులో ఈనెల 11న మహిళలకు ముగ్గుల పోటీలు.

## -ముఖ్య అతిథి మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్.





**అందోల్ జనవరి 7 ( రిపబ్లిక్ న్యూస్ )** ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డులోకాలనీ వాసులకు ఈనెల 11న సంక్రాంత్రి పండగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ముగ్గుల పోటీకి ముఖ్యఅతిథిగా అందోల్ మాజీ శాసనసభ్యులు క్రాంతి కిరణ్ హాజరవుతున్నారని పల్లె నాగలక్ష్మ వెంకటరమణ తెలిపారు . ముగ్గుల పోటీలో గెలుపొందిన మొదటి .రెండోవ మరియు మూడవ బహుమతులుగా పట్టు చీరలు ఇవ్వడం జరుగుతుందని ముగ్గుల పోటీలో బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

# ఘనంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**జనహృదయనేతకు జన్మదిన**

**శుభాకాంక్షలు వెల్లువలు..**

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**

**ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ**

**అంబరాన్నంటిన సంబరాలు.**





**మెదక్ జిల్లా ప్రతినిధి జనవరి 7( రిపబ్లిక్ న్యూస్)**

జనహృదయనేత, పేదల పెన్నిధి, అనునిత్యం ప్రజాసేవ కోసం పరితపించే నాయకురాలు, ఆపదలో నేనున్నానంటు అండగా నిలిచే గొప్ప నాయకురాలు, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,తెలంగాణ తొలి మాజీ డిప్యూటీ స్పీకర్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఏం పద్మ దేవేందర్ రెడ్డి 57 వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ వారి నివాసం కొంపల్లిలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కొంపల్లిలోని వారి నివాసంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్లు నాయకుల ఆధ్వర్యంలో పద్మ దేవేందర్ రెడ్డి చేత కేక్ కట్ చేయించారు, పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె. జితేందర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి. విజయలక్ష్మ యాదగిరి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బాదే. చంద్రం,పట్టణ నాయకులతో కలసి గజమాలతో ఘనంగా సన్మానించి కేక చేయించారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు కలసి కేక్ ను ఒకరికొకరు తినిపించుకొని స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. పద్మదేవేందర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఎల్లప్పుడూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు కేకులు కట్ చేసి పద్మ దేవేందర్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లు జయరాజ్, కిషోర్,ఆర్కే శ్రీనివాస్, మాయ. మల్లేశం,జెల్ల గాయత్రి, సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు లింగారెడ్డి, జుబెర్ అహ్మద్, కండెల. సాయిలు నాయకులు ప్రభు రెడ్డి, ఏనుగుల. రాజు,శంకర్,నగేష్, మధు, రుక్మా చారి, ఫాజిల్,గోపాల్, సంతోష్, శ్రీనివాస్ గౌడ్,శ్రీను నాయక్ స్వామి నాయక్,మోహన్ నాయక్, ఎంబిపూర్ మహేష్, రంజిత్, కిరణ్,చంద్ పాషా భువన్ తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి హనుమంతరావు జన్మదిన ఏర్పాట్లను పరిశీలించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు...





**మెదక్ జిల్లా ప్రతినిధి జనవరి 7( రిపబ్లిక్ న్యూస్)**కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా జన్మదిన వేడుకల ఏర్పాట్లను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పరిశీలించారు. ఈనెల 10న చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లి లో పదివేల మందితో జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జన్మదిన ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే రోహిత్ రావ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జన్మదిన వేడుకలు వచ్చే నాయకులు కార్యకర్తలకు చేసిన ఏర్పాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, రాజాసింగ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

## పుదుచ్చేరి, తమిళనాడుకు ఉత్తమ్ నియాకం

**న్యూఢిల్లీ,జనవరి, 7,(రిపబ్లిక్ న్యూస్):** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారంనాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు-పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్కి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కి ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మె?హమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.

# 5వ వార్డ్ లో కౌన్సిలర్ సమరానికి సై అంటున్న ఆ ఆరుగురు.

**-తుడం అశోక్.**

**-తాలుక లక్ష్మణ్.**

**-పెండగోపల్.**

**-పుర్ర శ్రీనివాస్.**

**-తుడుం రాజు.**

**-దాసరి ప్రభు శేఖర్.**









**అందోల్ జనవరి 7 ( రిపబ్లిక్ న్యూస్ )**

ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఎన్నికల జోష్ ఊపు అందుకుంది. కొందరు పార్టీ టైట్ కోసం ఆశతో బరిలో ఉన్నారు. ఇంకొందరు స్వతంత్ర అభ్యర్థులు గా బరిలో దిగుతున్నారు . ఈ యువతరం లో ఇంత ఎన్నికల్లో బరిలో ఉండాలి అనే జోష్ ఎందుకు వచ్చిందో సీనియర్ రాజకీయ నాయకులు కొందరు ఒంటెద్దు పోకడ పోతున్నారు అనే ఉద్దేశంతో యువత బరిలోకి వస్తున్నారు. యువకుల్లో మేము ఎన్నికల బరిలో ఉండి ప్రజా సేవ చెయ్యాలి అనే చైతన్యం ముందుకు తీసుకొస్తామని వీరందరూ అన్నారు.

ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఎవరైనా సరే యువకులు అభివృద్ధి ఎలా చేస్తారో చూడాలంటే ఈ యువ నాయకులు ప్రజాసేవకై ముందుకు వస్తున్నారు. నేనంటే నేనే అని ఎవరికి వారే వారి ధీమా వ్యక్తం చేస్తున్నారు.





# గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

**ఆర్థిక క్రమశిక్షణతో వచ్చే పంచాయతీ నిధులతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలి**

**పంచాయితీ పన్నువసూలలో లక్ష్యలు సాధించాలి**

**గ్రామాల్లో ఈనెల 8 నుంచి 11 వరకు పారిశుద్ధంపై స్పెషల్ డ్రైవ్**

**సర్పంచులకు- వార్డు సభ్యుల కు పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ పాలనపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహణ**

**గ్రామాలలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్**

**ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కలెక్టర్ కీలక ఆదేశాలు.**

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**






**మెదక్ జిల్లా ప్రతినిధి జనవరి 7 ( రిపబ్లిక్ న్యూస్)**

గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు,ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షంచారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు ముందుగా గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు మండల అభివృద్ధి అధికారులు ,గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధి లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

పారిశుద్ధంపై ఈ నెల 8 నుంచి 11 వరకు స్పెషల్ ట్రైన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గ్రామపంచాయతీ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా బాధ్యతలు చేపట్టిన వారికి గ్రామపంచాయతీ చట్టం, గ్రామాల అభివృద్ధి పై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసిన సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.. గ్రామ పంచాయతీలు ప్రజల నుండి ఆస్తి పన్ను (ఇంటి పన్ను), లైసెన్స్ ఫీజు,బిల్డింగ్ పర్మిషన్ ఫీజు,తై బజార్ ఫీజు వంటివి వసూలు చేయడంలో లక్ష్యలను సాధించాలని సూచించారు. గ్రామపంచాయతీ యాక్టుపై నూతన సర్పంచులకు, వార్డు మెంబర్లకు స్పష్టమైన అవగాహన పై పంచాయతీ కార్యదర్శులు గైడ్ చేయాలన్నారు.

గ్రామాలలో బాల కార్మికులు , బాల్యవివాహాల, నిర్మూలన ధ్యేయంగాపనిచేయాలన్నారు మూఢనమ్మకాలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు, కుల ధృవీకరణ పత్రాలు జారీ విషయంలో పారదర్శకత అవసరమని వివరించారు, వికలాంగులకు, విడోలకు పింఛన్ మంజూరు విషయంలో అర్హత గల లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు, చాలామంది వికలాంగులు సదరం సర్టిఫిట్ పొందే విషయంలో ఇబ్బందులకు గురి అవుతున్నారని వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు పథకం వేగంగా జరిగే విధంగా చూడాలన్నారు. భర్తను కోల్పోయి విడోగా ఉన్న మహిళలకు భారత ప్రభుత్వం ద్వారా 20,000 ఆర్థిక సహాయం పొందే పథకానికి సంబంధించి నిధులు ఉన్నాయని దీనికి సంబంధించి విడోలకు సహాయం అందించాలన్నారు .

గ్రామాలలో శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ చేపడతామని పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలు పచ్చదనంతో కలకలాడాలంటే మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. గ్రామాలు పారిశుద్ధ్యం పచ్చదనంతో కళకళలాడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీఅధికారులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

